


నవభూమి
వరంగల్
అనుబంధం
03 ఏప్రిల్,2025 గురువారం పేజిలు:6
www.epaper.navabhoomi.in


### రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ

# దేశంలోనే ప్రథమం

- పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాల అమలు
- మాజీఉపముఖ్యమంత్రి, ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి





**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యంపంపిణీ దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రథమమని మాజీ ఉప ముఖ్యమంత్రి. ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్లతో కలిసి ఘనపూర్(స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిర్వహించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మొదటిసారిగా రాష్ట్రంలోని రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చ్ 30(ఉగాది) పండుగ రోజున ప్రారంభించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో మొత్తం 90 లక్షల రేషన్ కార్డుదారులు ఉన్నారని, వాటి ద్వారా 2 కోట్ల 81 లక్షల 50 వేల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి నిరుపేదకు కడుపునిండా నాణ్యమైన సన్న బియ్యం బువ్వను అందించాలనే సంకల్పంతో ఈపథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. అలాగే ఈ పథకం పక్కదారి పట్టకుండా, ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి ఒక్క లబ్ధిదారులు ఈసన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ,. జిల్లాలోని (335) రేషన్ దుకాణాల ద్వారా (1,61,264) అన్ని రేషన్ కార్డుల లబ్ధిదారులకు (3,151) మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతకుముందు ఘనపూర్ (స్టేషన్) జఫర్గడ్, చిల్పూర్, రఘునాథపల్లి మండలాల వారీగా పలువురు లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్తో కలిసి ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి పంపిణీ చేశారు. ఈకార్య క్రమంలో ఆర్డీఓలు గోపీరాం,వెంకన్న,ఇంఛార్జి డీసీఎస్ఓ ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, డీఎం సీఎస్ హతీరాం, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సరస్వతి, శంకరయ్య, ఇతర సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, సిబ్బంది, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.




### నూతన చట్టాలు - అమ్మాయిల భద్రతపై షీ టీం

# కీలక సూచనలు




**మహబూబాబాద్ టౌన్ ఏప్రియల్ 02, నవభూమి:** జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశానుసారం తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, గూడూరులో నూతన చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై సునంద, ఉమెన్ పీఎస్ ఎస్సై ఆనందం, షీ టీం సిబ్బంది పార్వతి, రమేష్, భరోసా సిబ్బంది జోష్ణ, రేణుక, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఉమెన్ కానిస్టేబుల్ సుప్రజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటు షీ టీం, భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ క్రైమ్ పై వివరించారు. విద్యార్థులు నూతన క్రిమినల్ లా, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్, వాట్సాప్ కాల్స్ చేయరాదని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులను ప్రెస్ చేయరాదని, ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని తెలియజేశారు. మహిళలు ఆపద సమయంలో డయల్ 100 లేదా షీ టీమ్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఒంటరిగా ప్రయాణించే మహిళలు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టి-సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు మౌనంగా భరించకుండా షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని, అవసరమైన ఆత్మరక్షణ మార్గాలను నేర్చుకోవాలని వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచితులతో మాట్లాడరాదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో హరాస్మెంట్ లేదా సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. షీ టీమ్‌ను సంప్రదించడానికి క్యూఆర్ కోడ్ విధానం, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. మానవ అక్రమ రవాణా, మహిళల భద్రత, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను అపరిచితులను గుడ్డిగా నమ్మొద్దని, వ్యక్తిగత విషయాలు, ఫోటోలు ఇతరులతో షేర్ చేయరాదని హెచ్చరించారు. బ్లాక్‌మెయిల్‌కు గురైన వారు భయపడకుండా షీ టీమ్‌ను సంప్రదించాలని, వారి గోప్యతను కాపాడుతామని హామీ ఇచ్చారు. బాధితురాలు షీ టీమ్ కార్యాలయానికి రాలేని పరిస్థితిలో షీ టీమ్ సభ్యులే వారి వద్దకు వెళ్లి సహాయం అందిస్తారని తెలిపారు. షీ టీమ్ వాట్సాప్ నెంబర్ 8712656935 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గూడూరు వైస్ ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ యాదవ్, సీనియర్ అధ్యాపకులు షేక్ యూసఫ్ పాషా, ప్రత్యూష, నాగేశ్వరరావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**కాటారం,ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:**బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా కాటారం మండలం ధన్వాడ గ్రామం లో బుధవారం రోజున గౌడ సంఘం అధ్యక్షుడు చీటూరి రాజ లింగు గౌడ్ అధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భం గా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఆయన ఆశయాలను గౌడ కులస్తులు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్య క్రమంలో చీటూరి రాజ లింగు గౌడ్,మార్క రవీందర్ గౌడ్,చీటూరి మల్లయ్య గౌడ్,చీకట్ల స్వామి గౌడ్, మారగోని తిరుపతి గౌడ్, బొడిగే రాజీర్ గౌడ్, మారగోని రాజబాపు గౌడ్ గణపతి గౌడ్ పడాల శంకర్ గౌడ్,కారెంగల వెంకన్న గౌడ్,మారగోని నాగయ్య,మహేష్ గౌడ్,కిరణ్ గౌడ్,శ్రావణ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,శివ గౌడ్,రవి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



**మహాముత్తారం ఏప్రిల్ 2 నవభూమి:** మహాముత్తారం మండలంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మహాముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 08015 పరీక్ష కేంద్రంలో మొత్తం 154 మంది విద్యార్థులకు 154 మంది హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి చీప్ సూపర్డెంట్ బూడ్తుల తిరుపతి తెలియజేశారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు అధికారులు తెలియజేశారు.



# అగ్ని ప్రమాద బాధితురాలికి చేయూత

◆ బాధిత కుటుంబానికి బట్టలు,వంట సామాన్లు అందజేసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్

**కాటారం,ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** ప్రమాదవశత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి బుధవారం రోజున మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్ చేయూత నందించారు.కాటారం మండలం దేవరాంపల్లి గ్రామానికి చెందిన జిముడ దుర్గక్క అనే మహిళకు చెందిన ఇల్లు కొద్ది రోజుల క్రితం ప్రమాదవసత్తు అగ్ని ప్రమాదానికి గురై కాలి పోయింది.ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత మహిళను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి ఆమెకు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి,25 కిలోల బియ్యం అందజేశారు. అధైర్యపడవద్దు అండగా ఉంటామని ఆమెకు భరోసా ఇచ్చారు.అలాగే కాటారం తహశీల్దార్ కు ఫోన్ చేసి అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దుర్గక్క కుటుంబానికి తక్షణ సాయంఅందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాటారం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి జోడు శ్రీనివాస్,భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు జక్కు రాకేష్, మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బండం రాజమణి,ముల్కలపల్లి శ్రీ లక్ష్మి, కొండగొర్ల వెంకటస్వామి,గాలి సడువలి,చీమల వంశీ, బండం లక్ష్మారెడ్డి,మెడిగడ్డ దుర్గారావు,జాగిరి మహేష్,జాడి శ్రీశైలం,తూటి మనోహర్,బోర్లకుంట రాజయ్య, జిమ్మడ వంశీ,జిమ్మడ సమ్మయ్య,జిమ్మడ బాపు, సోదరి తిరుమల,కుసుమ బాణయ్య,గంధం రాజేంద్రప్రసాద్,ముంత బాపు,దుర్గం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.





## పుట్ట మధు వ్యాఖ్యలను ఖండించిన

# వివిధ సంఘాల నాయకులు

**మహాముత్తారం ఏప్రిల్ 2 నవభూమి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో జిల్లా గిరిజన యువజన సంఘం అధ్యక్షులు ఆలోత్ రూబీన్ నాయక్, నేతకానీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి తాటిపల్లి రాజబాబునేత, ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు పిలుమరి రమణాకర్ మాట్లాడుతూ...ఈ ప్రాంత అభివృద్ధి కోసం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేస్తున్నటువంటి పనులను ఓర్వలేక బీఆర్ఎస్ నాయకుడు పుట్ట మధు చేస్తున్న వాక్యాలను సంఘ నాయకులు ఖండించారు. మంత్రిపై పుట్ట మధు విషం కక్కుతూ, ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ మీడియాకు కనబడాలనే ఉద్దేశంతో పుట్ట మధు ఉన్నరని ఎద్దేవా చేశారు. మంథని– శివారం గోదావరి నదిపై బ్రిడ్జి ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు, వ్యాపారులకు చిన్న , సన్నకారు రైతులకు ప్రతి ఒక్కరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మంథని నియోజకవర్గ శాసనసభ్యులు, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంథని గ్రామంలోనే జన్మించారని నాయకులు



అన్నారు. శివారం పరిసర ప్రాంత ప్రజలు మంథని కి వస్తువులకు గాని, ఎరువులకు గాని ఇతరత్రా పనుల కోసం వస్తు వెళ్తుంటారని బ్రిడ్జి ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని నాయకులు అన్నారు. ఆరెంద గ్రామం బోయిన్ పేట వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయలని చెప్తున్నావ్, 10 సంవత్సరాలు నువ్వేం చేశావని , అధికారం పోయకా అభివృద్ధి గుర్తుకు వచ్చిందని పుట్ట మధును ప్రశ్నించారు.. మంథని నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే ప్రజలు ఎన్నికలలో మళ్లీ బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన, నేతకానీ మరియు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణ మహొూత్సవాన్ని విజయవంతం చేయండి

**మహాముత్తారం ఏప్రిల్ 2 నవభూమి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామంలో తేదీ: 03/04/2025 గురువారం రోజున ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణ మహొూత్సవం కార్యక్రమం జరుగునని ఆలయ పూజారి హాట్కర్ శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు 10 గంటలకు హాజరు కావాలని మనవి చేశారు. ఆ కార్యక్రమం అనంతరం హేమాసాద్ మహారాజ్, దేవి జగదాంబ భోగ్ బండారో కార్యక్రమం రెండు గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని కావున భక్తులు అత్యధికసంఖ్యలోపాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.



# ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి

**మంగపేట వర్కింగ్ జర్నలిస్ట్ కమిటీ అధ్యక్షుడు కటుకూరు సాంబశివరావు**



**మంగపేట ఏప్రిల్02(నవ భూమి):** ఎన్నో ఏళుగా ప్రభుత్వాలు జర్నలిస్టు సంక్షేమంపై దృష్టి సారిస్తామని ఎన్నికల సమయంలో హామీలే తప్ప నేటికీ నెరవేరిందేమి లేదని మంగపేట మండల వర్కింగ్ జర్నలిస్టుల సంగం అధ్యక్షుడు కటుకూరు సాంబశివరావు అన్నారు.గత ప్రభుత్వం పది సంవత్సరాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించిందని ప్రస్తుత ప్రజా ప్రభుత్వంపై నమ్మకంతో జర్నలిస్టులున్నారని ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చి ఆదుకోవాలన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలోను ఉద్యమం ఉప్పెనలా మారడానికి జర్నలిస్టులదే ప్రధాన పాత్ర అని గుర్తుచేశారు.ఎన్నో సంవత్సరాలుగా అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వాలు ప్రకటనలు చేయడంతో విని ఆనందపడటం తప్ప నేటికీ ఒరిగిందేమీ లేదన్నారు.గతంలో ప్రతిపక్ష శాసనసభ్యురాలుగా ధనసరి అనసూయ (సీతక్క) ఉన్నప్పుడు స్థానిక జర్నలిస్టులకు అండగా నిలిచి కేటాయించాల్సిన భూమిని సైతం పరిశీలించడం జరిగిందని కొన్ని అనివార్య కారణాలవల్ల వాయిదా పడడంతో మరింత జాప్యం నేటికీ కొనసాగుతుందన్నారు.మంత్రి సీతక్కకు ఈ విషయం పై పూర్తి అవగాహన ఉన్నందున మరికొంత దృష్టిసారించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పెద్దన్న పాత్ర పోషించే జర్నలిస్ట్ లను హక్కునచేర్చుకొని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.ముఖ్యమంత్రి తరువాత మంత్రిమండలిలో అంత ప్రాధాన్యత గల నాయకురాలిగా ఈ ప్రాంత శాసనసభ్యురాలే కావటంతో మొదటగా ములుగుజిల్లాలో ఉన్న జోర్నలిస్టు ఇక తమ సమస్యలు పరిస్కారమయ్యాయని ఆనందపడ్డారని నేటికీ ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. జర్నలిస్టులవి గొంతెమ్మ కోరికలేమి కాదని రాష్ట్రంలో కొందరు నాయకులు తమ నియోజకవర్గాలలో ఇదివరకే పరిష్కార మార్గాలు చూపారన్నారు ప్రభుత్వం దృష్టి సారించి అర్హత కలిగిన జర్నలిస్టుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆయన కోరారు

# ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలి

**మహబూబాబాద్** ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారీ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (%యూూూ%) ఆధ్వర్యంలో జిల్లాలో ఈనెల 20 నుంచి 26 వరకు థియరీ పరీక్షలు, 26 నుంచి మే 3 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు.బుధవారం ఐడీఓసీ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన లైన్ డిపార్ట్మెంట్ అధికారుల సమావేశంలో మహబూబాబాద్ పట్టణంలో ఓపెన్ ఎస్ఎస్సీ పరీక్షలు నిర్వహించే కేంద్రాలను ప్రకటించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీహెచ్ఎస్ జమాండ్లపల్లి, జెడ్పిహెచ్ఎస్ తొర్రూరులో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు టీఎస్ఎమ్ఎస్ అనంతారం, జెడ్పిహెచ్ఎస్ ఉన్నత బాలికల పాఠశాల మహబూబాబాద్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ తొర్రూరులో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయాల్లో కరెంట్ నిరంతరాయంగా అందించాలని, ఆర్టీసీ బస్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సెల్‌ఫోన్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను అనుమతించరాదని తెలిపారు.పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి మదార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి, మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ శివ ప్రసాద్, పోలీసులు, పోస్టల్, విద్యుత్, మునిసిపల్ అధికారులు, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ వినోద్,భరత్ పాల్గొన్నారు.



# లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం ఈనెల చివరి వరకూ ప్రభుత్వం పొడిగింపు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** లేఅవుట్‌క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) 25శాతం రాయితీని ఈనెల చివరి వరకు పొడిగించి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. దరఖాస్తుదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు

# మహాత్మ జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** వెనుకబడిన తరగతుల విద్యార్థిని విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కమ్యూనిటీకి చెందినవారు మహాత్మ జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్ తెలిపారు.అర్హులైన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో 2025, ఏప్రిల్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.అర్హులైన విద్యార్థినివిద్యార్థులు డబ్ల్యుడబ్లూడబ్ల్యూ. తెలంగాణ ఈపాస్. సీజీజీ..గౌట్.ఇన్. వెబ్సైటులో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# జిల్లా నూతన వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.రవి



**మహబూబాబాద్ టౌన్ ఏప్రిల్ 2, నవభూమి ప్రతినిధి:** జిల్లాకు నూతన వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వచ్చిన డాక్టర్ బి రవి బుధవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను ఐ.డి.ఓ.సి లోని కలెక్టర్ చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాను అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో ముందంజలో ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి స్థానిక సంస్థలు అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వీర బ్రహ్మాచారిని మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, మాస్ మీడియా సెక్షన్ అధికారులు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ ఆఫీస్ సిబ్బంది, ఎన్ హెచ్ ఎం సిబ్బంది ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి,డాక్టర్ ప్రమీల,డాక్టర్ నాగేశ్వరరావు,డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్ కుమార్ డాక్టర్,శ్రవణ్ కుమార్, డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ , జిల్లా టీఎన్జీవోల అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి కొప్పు ప్రసాద్, కె.వి.రాజు,పురుషోత్తం హెల్త్ ఎడ్యుకేటర్స్, తదితరులు పాల్గొన్నారు.



# రేణుక (మిడ్కో)కు నివాళులర్పించిన లిబరేషన్ జిల్లా కమిటీ

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

## బరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జనగాం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గుమ్మడి రాజుల సాంబయ్య



**పాలకుర్తి నవభూమి ఏప్రిల్ 02** జిల్లాలోని దేవరుప్పుల మండలం కడవెండి గ్రామ మావోయిస్టు నాయకురాలు, విప్లవ రచయిత్రి, రేణుక అలియాస్ మిడ్కో కు,సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జనగామ జిల్లా కమిటీ బుధవారం నివాళులర్పించింది.రేణుకా అంత్యక్రియల్లో జిల్లా కమిటీ పాల్గొని రేణుక మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జనగాం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గుమ్మడి రాజుల సాంబయ్య మాట్లాడుతూ.. విప్లవాల పుటిగడ్డపై జన్మించి విప్లవోద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసే రేణుక స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని ప్రజల ముందు ఉంచారని తెలిపారు.పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి నమ్ముకున్న సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు యుద్ధ రంగంలో నిలిచిందని ఆమె సేవలను కొనియాడారు.రచయిత్రిగా సాహిత్యంలో తనకంటూ ఒక గుర్తింపు సాధించి విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో అటుపోట్లను ఎదుర్కొని తెలంగాణ ప్రజల దిక్కారాన్ని,ఈ ప్రాంత విప్లవ వారసత్వాన్ని చాటి చెప్పిందని గుర్తు చేశారు.ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తమ బిడ్డలపై యుద్ధం చేస్తుందని, కుట్రపూరితంగా ఎన్కౌంటర్లకు పాల్పడుతుందని విమర్శించారు.ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులతో చర్చలు జరిపి రాజకీయ పరిష్కారాన్ని చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు జీడి సోమయ్య, తూర్పాటి సారయ్య,గ్యారా రాజు మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి నాలమాస రమేష్ .ఉద్యమ కారుల సంఘం జిల్లా నాయకులు సాంఘి వెంకన్న.ఉమాకర్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దళిత వాడల్లో అంగరంగ వైభవంగా సిసి రోడ్ల నిర్మాణం..!

## జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజలెన్స్ మెంబర్ మురుకుట్ల నరేందర్



**మంగపేట,ఏప్రిల్ 02(నవభూమి):** జిల్లా వ్యాప్తంగా ఎస్సి జనాభ ఉన్న ప్రతి గ్రామములో ఎన్నడూ లేని విదంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కొరకు ప్రతి గ్రామములో వీధి వీధికి నూతనంగా కొన్ని కోట్ల రూపాయల తో సిసి రోడ్ల నిర్మానములు చేపట్టడం గర్వకారణం అని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సహకారం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి స్థానిక మంత్రి మా ఆడబిడ్డ సీతక్క కి దళిత వర్గాల తరుపున కృత్ఞతలు తెలుపుతున్నామని నరేందర్ అన్నారు. గత పదేళ్ల కాలం లో ఎన్నడూ కూడా ఒకేసారి ఇంత అభివృద్ధి జరగలేదని తెలంగాణ ప్రభుత్వం మంత్రి సీతక్క చేస్తున్న ఈ అభివృద్ధి చిరకాలం మా గుండెల్లో నిలిచిపోతుంది అని కొనియాడారు అంతేగాక వివిధ పతకాల రూపేన గ్రామాల్లో నెలకొల్లున్న అభివృద్ధి పనులు చాలా గొప్పగా ఉన్నాయని సీతక్క ఎన్నికల సంధర్భములో చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి చేస్తున్న ప్రతి పనిని చూసి ప్రజలు ఏంతో సంతోషపడుతున్నారని అన్నారు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నది ఒకప్పటి మాట అని ఎక్కడ చూసిన సీతక్క మాటే అక్క చెస్తున్న అభివృద్దే కనిపిస్తుందని గ్రామాల్లో పండుగ వాతావరాణము నెలకొంది అని హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీ సీతారామ ముత్యాల తలంబ్రాలు ఆర్టీసీ కార్గో ద్వారా మీ ఇంటికి..

### విబిఓ వేల్పుల చంద్రమౌళి



**భూపాలపల్లి/మహాముత్తారం ఏప్రిల్ 2 నవభూమి:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్గో లాజిస్టిక్ సర్వీస్ ద్వారా భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ ముత్యాల తలంబ్రాలను భక్తులకు వారి ఇంటి వద్దకు కేవలం 151/- రూపాయలకు మాత్రమే అందించడం జరుగుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా విబిఓ వేల్పుల చంద్రమౌళి తెలియజేశారు. ఇట్టి మంచి అవకాశాన్ని భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం వెళ్లలేని స్వామి భక్తులు సద్వినియోగం చేసుకొని స్వామి వారి కృపకు మరియు కరుణాకటాక్షములకు పాత్రులు కాగలరని చంద్ర మౌళి కోరారు.

# పదో తరగతి పరీక్షల సరళి పర్యవేక్షణ

### సాంఘీకం (సోషల్) పేపర్‌కు 99.94 శాతం మంది విద్యార్థుల హాజరు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ సెయింట్ పాల్స్ పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బుధవారం సందర్శించి పదవ తరగతి పరీక్షల సరళిని పర్యవేక్షించారు అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించి, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్తో లోపలికి ఎవ్వరినీ అనుమతించవద్దని తెలిపారు. అదే విధంగా ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. ప్రహారీ గోడ సరిగా లేని చోట భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంఘీకం (సోషల్) పరీక్షకు జిల్లా వ్యాప్తంగా (6238) మంది విద్యార్థులకు గాను (6234) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. అలాగే నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని, (99.94) శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఈతనిఖీలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్ తెలిపారు. నేడు గురువారం ఉదయం 10 గంటలకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రోడ్లోని కళ్లెం కమాన్ వద్ద దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లుతెలిపారు. ఈకార్యక్రమానికి కురుమ కులసంఘ నాయకులు, ప్రతి నిధులు, ఇతర కుల సంఘాల నాయకులు, ప్రజలు అత్యధికంగా హాజరై విజయవంతం చేయాల్సిందిగా బీసీసంక్షేమ జిల్లా అధికారి బి రవీందర్ కోరారు.

# సన్న బియ్యం పంపిణీతో పేదలకు మరింత లబ్ధి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్2** సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. బుధవారం, జనగామ మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రేషన్ దుకాణం (షాప్ నంబర్ 1)తో పాటు అలాగే జిల్లా కేంద్రంలోని గుల్లగడ్డలో గల రేషన్ దుకాణాలలో (షాప్ నంబర్ 9)లో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్య క్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని ప్రారంభించారు. అలాగే లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేదకు లాభం చేకూర్చే విధంగా సన్న బియ్యం పంపిణీ పథకం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో అత్యధిక విలువ గల పోషకాలు విటమిన్లు కలిగి ఉంటాయని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈసన్న బియ్యాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, తహసీల్దార్ హుస్సేన్, ఇంఛార్జి డీసీఎస్ఓ ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, రేషన్ డీలర్లు ఎల్లయ్య, అబ్బాస్, డీటీ సీఎస్ శ్రీనివాస్, రేషన్ డీలర్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని వినియోగించుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్

**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** లబ్ధిదారులు సన్నబియ్యంపంపిణీపథకాన్ని సద్వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ కోరారు. బుధవారం, నర్మేట మండలంలోని హన్మంతాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రేషన్ దుకాణంలో (షాప్ నంబర్ 9) ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. అదే విధంగా రేషన్ కార్డు దారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యాన్ని అందించాలన్న చారిత్రాత్మక పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సన్నబియ్యంతో పాటు ప్రభుత్వం అందిస్తోన్న అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని, అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, డీలర్ విజయలక్ష్మి, రేషన్ డీలర్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న దుద్దిల్ల శ్రీనుబాబు



**కాటారం,ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:**కాటారం మండలం కొత్తపల్లి గ్రామంలో మహదేవపూర్ మండల ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు పుప్పిరెడ్డి రంజిత్ రెడ్డి సోదరుని వివాహ నిశ్చితార్థ వేడుకల్లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీనుబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జై బాపు,జై బీమ్, జై సంవిధాన్ లను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు,శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీనుబాబు

**భూపాలపల్లి,ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:** మహదేవపూర్ మండలం రాపెల్లికోట గ్రామంలో బుధవారం రోజున ఏఐసీసీ,టీపీసిసి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సూచన మేరకు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కమిషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి,దుద్దిళ్ళ శ్రీనుబాబు లు పాల్గొని గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. గ్రామ వీధుల్లో తిరుగుతూ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ యొక్క సందేశం ప్రజలకు దుద్దిల్ల శ్రీను బాబు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా దుద్దిల్ల శ్రీనుబాబు మాట్లాడుతు..మహాత్మాగాంధీ, అంబేద్కర్ ల రాజ్యాంగాన్ని గౌరవించు కుందాం అని సూచించారు. ఈ మూడు సూత్రాల మీద దేశం మొత్తం మీద కార్యక్రమం జరుగుతుందని అన్నారు. జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసు కెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ సెల్ నాయకులు,ఎస్టీ సెల్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసిన వరంగల్ ఎంపి

## వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ఆమోదానికి కృతజ్ఞతలు

## వరంగల్ ఎంపి డాక్టర్.కడియం. కావ్య



**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** ఢిల్లీలో కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజారపు. రామ్మోహన్నాయుడుని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇటీవల వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్‌కు ఆమోదం తెలిపినందుకు ప్రత్యేకకృతజ్ఞతలు తెలియజేశారు. వరంగల్ మామునూరు ఎయిర్పోర్ట్ డెవలప్‌మెంట్, ఎయిర్‌క్రాఫ్ట్ కార్యకలాపాలను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఎంపీ కోరారు. మామునూరు ఎయిర్పోర్ట్ నిర్మాణానికి గౌరవముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకచొరవను తీసుకున్నారని వెల్లడించారు. ఎయిర్ పోర్టు భూసేకరణకు తెలంగాణ సర్కార్ 205 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. మామునూరు ఎయిర్పోర్ట్ కు అవసరమైన మౌలిక సదు పాయాలను పెద్దవిమానాల కార్యాచరణను త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని వరంగల్ ఎంపీ అభ్యర్థించారు. ఈసందర్భంగా, రామ్మోహన్ నాయుడు వరంగల్ విమానాశ్రయ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు, రోడ్డు కనెక్టివిటీ, మౌలిక వసతుల కల్పన, భూసేకరణ అనంతరం విమాన రాకపోకలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

## విజయవంతంగా ముగిసిన శ్రీపాద స్మారక జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

## విజేతలకు బహుమతులు అందజేసిన దుద్దిల్ల శ్రీనుబాబు

**కాటారం,ఏప్రిల్ 2 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్ పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ఎరవెల్లి విలాస్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపాద స్మారక జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం రోజుకు ఫైనల్ కి చేరుకోగా హోరా హోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్ ను దుద్దిల్ల శ్రీను బాబు తిలకించి అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా శ్రీను బాబు గారు మాట్లాడుతూ..క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని,ఆరోగ్యంతో జీవించ వచ్చని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగాలలో కూడా రాణించాలని,క్రీడలలో రాణించి మన ప్రాంతానికి పేరు తెచ్చేలా తల్లి తండ్రులు పిల్లలని ప్రోత్సహించాలని కోరారు.గెలిచిన జట్లకు శుభాకాంక్షలు తెలిపి ఓడిన జట్లు ఆదర్యపడకుండా ఓటమి గెలుపుకు తొలి మెట్టు గా భావించి ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.





## పేదల ఆకలిని గుర్తించిన

# మనసున్న మనిషి ముఖ్యమంత్రి

- దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నది ఏకైక తెలంగాణ రాష్ట్రం
- సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలి. దళారులకు అమ్ముకోవద్దు
- మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే,కడియం.శ్రీహరి



**జనగామ నవభూమి ప్రతినిధి ఏప్రియల్ 2** పేదల ఆకలిని గుర్తించిన మనసున్న మనిషి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ఘనపూర్ ఎమ్మెల్యే కడియం.శ్రీహరికొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలోనే ఏరాష్ట్ర ప్రభుత్వం చేయని సాహసం తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసారని తెలిపారు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి, జాఫర్ గూడెం, రఘునాథపల్లి గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మాకంగా ప్రవేశ పెట్టిన తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్ర్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని రేషన్కార్డు లబ్ధి దారులకు సన్నబియ్యం పంపిణీ చేసీ మాట్లాడారు. ఆనాడు 2రూపాయలకు కిలో బియ్యం మాజీముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఇస్తూ ఎలా గుర్తుండిపోయారో? ఈనాడు సన్నబియ్యం పంపిణీ చెస్తున్న సీఎం రేవంత్ రెడ్డి పేరును కూడా అదేస్థాయిలో గుర్తిండి పోతుందని అన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన దొడ్డుబియ్యం అక్రమ మార్గల్లో రాష్ట్రం దాటి, దేశం దాటి పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం అందించే బియ్యం పేదల కడుపు నింపాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెల్ల రేషన్కార్డు కలిగినప్రతీకుటుంబానికిఒక్కరికీ 6కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశంలో ఏరాష్ట్రం చేయనిసాహసం తెలంగాణ ప్రభుత్వం చేసిందని అన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నియోజక వర్గ అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోలేదని ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి ఇప్పటి వరకు ప్రతీరోజు నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తున్నాని వెల్లడించారు. కరువు మండలాలగా ఉన్న రఘునాథపల్లి, లింగాల ఘనపూర్ మండలాలకు గోదావరి జలాలు తీసుకువచ్చానని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాలువల వెంట తిరుగుతూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కాలువల నిర్మాణం, పూడికతీత, చెట్ల తొలగింపు వంటి పనులను వేగవంతం చేసి ఈరోజు జీడికల్ వరకు గోదావరి జలాలు తీసుకురాగాలిగమని అన్నారు. మరో ఏడాది కాలంలో నియోజకవర్గం లోని ప్రతీ ఎకరానికి సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్దే ఏకైక ఎజెండా అని, నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే వరకు విశ్రమించనని పేర్కొన్నారు. ఈకార్య క్రమంలో అధికారులు, నాయకులు, కార్య కర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# ఆపరేషన్ కగార్‌ని తక్షణమే నిలిపివేయాలి

**వరంగల్ నవభూమి:** ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీ, గిరిజన ప్రజల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ప్రజా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయం సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో న్యూమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు ప్రజా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిని, అడవి సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి గిరిజనులపై కేంద్ర ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం హయాంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఏప్రిల్ 8న ఉదయం 11గంటలకు ప్రజా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడానికి కేంద్ర కమిటీ తీర్మానం చేసిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వర్రావు, బన్న నరసింగం, మన్ను కరుణాకర్, ఎండీ అక్బర్, బండి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

